సాక్షి
వనపర్తి
సోమవారం । 22 । జనవరి । 2024



భూగర్భకేంద్రం పరిశీలన

శ్రీశైలం భూగర్భ విద్యుత్ కేంద్రాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ పరిశీలించారు.

వివరాలు 8లో ▸



సాగుకు విరామం

కృష్ణానదిలో నీరు లేక పరీవాహక రైతులు యాసంగి సాగుకు విరామం ప్రకటించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.3 /20.1

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి, ఉదయం, రాత్రి చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

కొత్తకోట రూరల్: గురుకుల ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ దరఖాస్తు గడువును 23వ తేదీ వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర (వీపనగండ్ల) ప్రిన్సిపాల్ ఎస్.దయాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు tswreis.ac.in వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి

- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ప్రేమ్ టైలర్ మన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వస్త్ర సంచుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దుకాణదారులు 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న కవర్లను వినియోగిస్తున్నారని.. అధికారులు దాడులు నిర్వహించి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు కదిరె రాములు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

వనపర్తి: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి మృతిచెందిన గట్టు దినేష్ కుటుంబాన్ని ఆదివారం జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్‌ఎస్ నాయకుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. చేతికొచ్చిన కుమారుడు అకస్మాత్తుగా మృతిచెంది కన్నవారికి కడుపుకోత మిగల్చటం బాధాకరమన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు పి.బాలకృష్ణ, సురేష్ తల్లి ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకొని ఆయా కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, నాయకులు అశోక్, బీచుపల్లి, రమేష్, సయ్యద్ తదితరులు ఉన్నారు.

కూచిపూడికి గుర్తింపు తీసుకురావాలి



పెబ్బేరు రూరల్: కూచిపూడి నృత్యకళకు వనపర్తి పుట్టినిల్లు కావాలని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ కోరారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో గత నెల 24న జరిగిన కూచిపూడి నృత్య మహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, గురువులను ఆదివారం జిల్లాకేంద్రంలోని పానుగంటి శారదమ్మ సంస్కార భవనంలో జిల్లా సాహితీ వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కవులు, కళాకారులకు వనపర్తి పుట్టినిల్లుగా వెలుగొందుతుందన్నారు. జిల్లా కళాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని.. అందుకు కారణం గురువులు, తల్లిదండ్రుల ప్రోత్సాహమేనని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.చంద్రశేఖర్, సామాజికవేత్త ధనలక్ష్మి, సాహితీ వేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, గాయకులు సత్తార్, రామిరెడ్డి, శివలింగం, రాములుయాదవ్, గంధం నాగరాజు, కళాకారులు ప్రసన్న, సుగుణ, మల్లికార్జున్, చిన్నారుల తలిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై రాజీలేని పోరాటం

అమరచింత: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటం చేయాలని, అప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన లెనిన్ వర్ధంతి కార్యక్రమం, అనంతరం ఆత్మకూర్, అమరచింత మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజల అవసరాలు, సమస్యలు పరిష్కరించేందుకు ఉద్యమాలు చేయాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ గ్రామాల్లో అభివృద్ధి పనులు మరుగునపడ్డాయని తెలిపారు. గ్రామీణ ప్రజలకు నేటికీ మిషన్ భగీరథ నీరు సైతం అందని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరచింతలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ పీహెచ్‌సీ ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల తరఫున అధికారులు, పాలకులతో పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల సీపీఐ అధ్యక్షులు అబ్రహం, రాబర్ట్, నాయకులు కుతుబ్, భాస్కర్, మోషా, శ్యాంసుందర్, ఎర్రన్న, గీతమ్మ, సీఎస్ శెట్టి, మల్లేష్, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేడుక

బాలరాముడి ప్రాణప్రతిష్ట వేళ ముస్తాబైన ఆలయాలు

- మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరణ..
- అన్నదాన కార్యక్రమాలు, భారీగా శోభాయాత్రలకు సన్నాహాలు
- జిల్లాకేంద్రంలో రెండువేల మందితో..
- మాంసం విక్రయాలు నిలిపివేయాలని ఆదేశాలు



విద్యుద్దీపాల అలంకరణలో కొత్తకోటలోని కోట్ల ఆంజనేయస్వామి ఆలయం



జిల్లాకేంద్రంలోని రామాలయం..

వనపర్తి: అయోధ్యలో సోమవారం మధ్యాహ్నం బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్టను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఉన్న రామ మందిరాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు ముస్తాబయ్యాయి. ఇప్పటికే అయోధ్యలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట క్రతువు ప్రారంభమైన నేపథ్యంలో పల్లెలు, పట్టణాలు కాషాయ జెండాలు, రామనామస్మరణతో మార్మోగుతున్నాయి. జిల్లాకేంద్రంలో రామాలయంతో పాటు వేంకటేశ్వరస్వామి, బాలహనుమాన్, చింతల హనుమాన్ ఆలయాలు, గోపాల్‌పేటలోని కోదండరామస్వామి, ఆత్మకూరు బాలబ్రహ్మేశ్వరస్వామి, కొత్తకోటలోని కోట్ల ఆంజనేయస్వామి, పాన్‌గల్ మండలం శాఖాపురం శివాలయాన్ని పచ్చటి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహణకు అర్చకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలోని రామాలయం, బాలాంజనేయస్వామి తదితర ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- జిల్లాకేంద్రంలో రామాలయం నుంచి ప్రధాన కూడళ్ల మీదుగా చింతల ఆంజనేయస్వామి ఆలయం వరకు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలతో వేలాది మందితో శోభాయాత్ర నిర్వహించేందుకు విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాణ ప్రతిష్ట వేడుకను సామూహికంగా తిలకించేలా జిల్లావ్యాప్తంగా 399 భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను విశ్వహిందూ పరిషత్, అయోధ్య రామ మందిరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు.



గోపాల్‌పేటలోని కోదండరామస్వామి ఆలయం

నామినేటెడ్ సందడి

త్వరలో రాష్ట్ర, జిల్లాస్థాయి కార్పొరేషన్ పదవుల భర్తీ

- సీఎం విదేశీ పర్యటన నుంచి రాగానే ప్రక్రియ పూర్తి
- ఉమ్మడి పాలమూరులో అధిక సంఖ్యలో ఆశావహులు
- కీలక నేతలకు వరించే పోస్టులపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ
- కష్టకాలంలో పార్టీ వీడని వారికి ప్రాధాన్యం?



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల సందడి నెలకొంది. ఈ నెలాఖరు నాటికి పదవుల భర్తీ చేపడుతామని ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన తిరిగి వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న వారు, నమ్మకంతో శ్రమించిన విధేయులు, కీలక నేతల్లో పదవులపై ఆశలు రేకెత్తుతున్నాయి.

సర్దుబాటు ఎలా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్‌కు చెందిన పలువురు ముఖ్య నేతలు భావించినా.. వారికి అవకాశం దక్కలేదు. అధిష్టానం సూచనలతో పార్టీ టికెట్ కేటాయించిన అభ్యర్థుల గెలుపునకు కృషిచేశారు. వీరు ప్రధానంగా ఎమ్మెల్సీలతోపాటు నామినేటెడ్ పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇందులో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సుమారు దశాబ్దకాలం తర్వాత అధికారంలోకి రావడంతో హస్తం శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నాయి. ఇదే సమయంలో పార్టీని నమ్ముకుని గెలుపునకు శ్రమించిన విధేయులకు వారికి తగిన స్థాయి పదవులను ఎలా భర్తీ చేస్తారనే అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

⇨ ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీ మాజీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు నామినేటెడ్ రేసులో ఉండగా ఎవరికి ఏ పదవులు వరిస్తాయనేది హాట్‌టాపిక్‌గా మారింది.

నియోజకవర్గాల వారీగా..

మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, ఎస్‌ఏ వినోద్‌కుమార్, నాయకులు ఎన్‌పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనితతోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ రాధ కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

⇨ నారాయణపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి

⇨ గద్వాల నియోజకవర్గంలో బి.చంద్రశేఖర్‌రెడ్డి..

⇨ కొల్లాపూర్ నియోజకవర్గంలో ఏఐసీసీ బీసీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నామినేటెడ్ పోస్టుపై ఆశతో ఉన్నారు.

⇨ జడ్చర్ల నియోజకవర్గం నుంచి ఎండీ రబ్బానీ, జమీర్, దేవరకద్ర నుంచి రాచాల యుగంధర్‌గౌడ్, మక్తల్ నుంచి మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి లేదా ఆమె కుమారుడు సిద్ధార్థరెడ్డిలో ఎవరో ఒకరికి గత ఎన్నికల్లో అధిష్టానం హామీ ఇచ్చినట్లు సమాచారం. అదేవిధంగా బీసీ నేత కె.నాగరాజుగౌడ్ నామినేటెడ్ పదవులపై ఆశతో ఉన్నారు.

⇨ కల్వకుర్తి నియోజకవర్గంలో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, అచ్చంపేట నియోజకవర్గంలో ఓయూ విద్యార్థి నేత చారకొండ వెంకటేష్ తదితరులు పదవులపై ఆశతో ఉన్నారు.

వీరిపైనే ప్రధాన చర్చ..

వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ మొదట మాజీ మంత్రి చిన్నారెడ్డికి కేటాయించారు. చివరలో అభ్యర్థిని మార్చి మేఘారెడ్డికి బీఫాం ఇవ్వగా.. ఆయన గెలుపొందారు. ఆ సమయంలో చిన్నారెడ్డిని అధిష్టానం బుజ్జగించడంతోపాటు ఆయన స్థాయికి తగిన పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఆయనకు తగిన స్థానం కల్పిస్తామని ప్రకటించారు. అలాగే ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి కూడా అధిష్టానం హామీ ఇచ్చింది. ఈ క్రమంలో చిన్నారెడ్డికి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారని, శివసేనారెడ్డికి ఏదైనా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ లేదా డైరెక్టర్ పదవి ఇస్తారనే ఊహాగానాలు వెలువెత్తుతున్నాయి.

⇨ కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి జగదీశ్వరరావు గత ఎన్నికల్లో టికెట్ ఆశించారు. కానీ, జూపల్లికి కేటాయించిన క్రమంలో ఆయన నిరుత్సాహానికి గురికాగా.. పార్టీ పెద్దలు బుజ్జగించి.. తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన సైతం ఎమ్మెల్సీపై ఆశపెట్టుకున్నట్లు సమాచారం.

⇨ గద్వాలలో గత ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నాయకురాలు సరితకు కార్పొరేషన్ పదవి ఇస్తారనే చర్చ జరుగుతోంది. అలాగే అలంపూర్‌లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సైతం ఎమ్మెల్సీ లేదా నామినేటెడ్ రేసులో ఉన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే అబ్రహం, మాజీ ఎంపీ మందా జగన్నాథ్ కూడా పదవులను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయికి 11 ప్రదర్శనలు

కొత్తకోట రూరల్: జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన **ఈ నెల 9 నుంచి** 18వ తేదీ వరకు జిల్లా విద్యాధికారి గోవిందరాజులు ఆధ్వర్యంలో ఆన్‌లైన్ పద్ధతిన నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 108 ప్రదర్శనలు రాగా.. ఉత్తమంగా ఉన్న **11 ప్రదర్శనలు** రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ఆయా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం, సోమవారం ఆన్‌లైన్‌లో తమ ప్రదర్శనలను అప్‌లోడ్ చేయనున్నారు.

- రాష్ట్రస్థాయికి ఎంపికైన ఉపాధ్యాయుడు : పి.మురళీకృష్ణ (హెచ్‌ఎం, ప్రాథమికోన్నత పాఠశాల, రామకృష్ణాపురం).. విద్యార్థులు టి.అక్షయ (7వ తరగతి, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కొత్తకోట), భువనేశ్వరి (9వ తరగతి, జెడ్పీ హెచ్‌ఎస్, జంగమాయపల్లి, పెద్దమందడి), ఇమాద్ (8వ తరగతి, మదర్స్ హైస్కూల్, వనపర్తి), వి.సాయిశ్రీ (9వ తరగతి, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వనపర్తి), పి.అమృత (7వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, రామకృష్ణాపురం, కొత్తకోట), ఏ.లహరి (9వ తరగతి, ప్రతిభ ఉన్నత పాఠశాల వనపర్తి), పి.శ్రీవిద్య (8వ తరగతి, తెలంగాణ మోడల్ స్కూల్, ఖిల్లాఘనపురం), అమీనా సమ్రీన్ (9వ తరగతి, అక్షర మోడల్ స్కూల్ వనపర్తి), ఎం.భాస్కర్ (8వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల గోప్లాపూర్, గోపాల్‌పేట), వి.మానిక (10వ తరగతి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కొత్తకోట), ఎం.వైష్ణవి (10వ తరగతి, తెలంగాణ మోడల్ స్కూల్ ఖిల్లాఘనపురం) ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నరేందర్

వనపర్తిటౌన్: విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచిస్తే మూఢ నమ్మకాల బారిన పడకుండా ఉంటారని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నరేందర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని డీఎస్‌ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో కొనసాగుతున్న మూఢనమ్మకాలు, వాటి వ్యాపారంపై విద్యార్థులు చైతన్యం కావాలని, కుటుంబసభ్యులు, తోటి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. రాజ్యం నుంచి మతాన్ని వేరు చేయడమే లౌకికవాదమని.. నేటి పాలకులు లౌకిక స్ఫూర్తికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని నాశనం చేసే కుట్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది, ఉపాధ్యక్షుడు మొగిలి, నాయకులు మల్లేష్, వీర, ప్రసాద్, నందు, రాహుల్, స్వప్న, శ్రీలత, ఉష, సురేఖ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు అచ్చొచ్చిన అధికార ప్రతినిధి

- మరోమారు మల్లురవిని నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి




జడ్చర్ల: ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి పదవి అచ్చివస్తుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవిని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ హయాంలోనూ సీఎం కేసీఆర్ మాజీ ఎంపీ జగన్నాథంకు రెండు పర్యాయాలు ఇదే పదవిని కట్టబెట్టారు. తాజాగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మల్లురవిని రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా నియమించారు. దీంతో ఇప్పటి వరకు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధులుగా నాలుగు సార్లు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మాజీ పార్లమెంట్ సభ్యులకు అవకాశం దక్కడం విశేషం.

– మల్లురవి 1991– 1996, 1998–1999లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పనిచేశారు. అలాగే 2008లో జడ్చర్లకు జరిగిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత జడ్చర్ల అసెంబ్లీ స్థానానికి మూడు సార్లు, నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. తాజాగా మల్లురవి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. మల్లురవికి గతంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఉండడంతో రాష్ట్రానికి మరింత మేలు జరిగే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మల్లురవికి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కేబినేట్ హోదా దక్కడంతో ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం జడ్చర్లకు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చిరుతల భయం

ఖిల్లాఘనపురంలోని గుట్టలో సంచారం

- పశువుల పాకలు, గొర్రెలు, మేకలపై దాడి
- ఆందోళనలో రైతులు, గ్రామస్తులు



ఖిల్లాఘనపురం మండలం రాంరాయనిపల్లిలోని బోడగుట్ట



ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు తరచూ చిరుతలు కనిపించడంతో పాటు జీవాలపై దాడి చేసి చంపుతుండటంతో భయంతో వణికిపోతున్నారు. రాత్రిళ్లు బయటకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతల సంచారాన్ని గుర్తించి బంధించి పట్టుకెళ్లాలని ఆయా గ్రామాల రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

భయం గుప్పిట..

ఖిల్లాఘనపురం సమీపంలోని వంతెన దగ్గర వెంకటాంపల్లికి చెందిన సిద్ధి పర్వతాలు ఆవుదూడను 2024, డిసెంబర్ 9న రాత్రి ఎత్తుకెళ్లి చంపేసింది. గుర్తించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చిరుత లేక ఐనానా అని పరిశీలించారు. మండల కేంద్రం సమీపంలో అదికూడా నిరంతరం వాహనాలు నడిచే బీటీ రహదారి పక్కకు ఎలా వచ్చిందని ఆలోచిస్తున్న సమయంలోనే రాంరాయనిపల్లి సమీపంలోని బోడగుట్టపై రెండు చిరుతలు కనిపించాయి. పక్కనే ఉన్న పశువుల పాకలోకి వెళ్లేందుకు యత్నిస్తుండగా అక్కడే ఉన్న కుక్కలు మొరగడంతో గ్రామస్తులు, తండవాసులు అక్కడికి చేరుకొని కేకలు వేయడంతో గుట్టపైకి వెళ్లాయి. అనంతరం పర్వతాపురం, మామిడిమాడ గ్రామాల మధ్యన కొందరు బాటసారుల కంటపడటంతో భయంతో వణికిపోయారు. ఈ నెల 17న సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో పర్వతాపురం శివారులో గొల్ల సాడయ్యకు చెందిన గొర్రెను కాపరి చూస్తుండగానే చిరుత ఎత్తుకెళ్లి చంపేసింది. ఈ నెల 20న మండలంలోని షాపురం గ్రామ శివారులో మామిళ్ల శేషయ్యకు చెందిన మేకను ఓ గుహలోకి లాక్కెళ్లి చంపి తినేసింది. 21న ఉదయం 9 గంటల ప్రాంతంలో మండల కేంద్రం నుంచి పర్వతాపురం గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఉన్న నందకిశోర్ రైస్‌మిల్లు దగ్గర చిరుత కనిపించడంతో వణికిపోయాడు. ఇలా చిరుతలు రోజుకు ఒక గ్రామంలో కంటపడుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.



పొలాల వద్ద మంటలు వేసుకున్న రైతులు

సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా..

బోడగట్టుపై చిరుతలు కనిపించడంతో అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాని అవి కెమెరాల కంటపడకుండా రాంరాయనిపల్లి బోడగుట్ట, పర్వతాపురం, షాపురం గుట్టల్లో సంచరిస్తుండటంతో పాటు మేకలు, గొర్రెలు, పశువుల పాకలపై దాడి చేస్తున్నాయి. కెమెరాలకు చిక్కకపోవడంతో చిరుతను ఎలా పట్టుకోవాలి.. బోను ఎక్కడ ఏర్పాటు చేయాలని ఫారెస్టు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చిరుతలు కనిపించిన రెండే ఉన్నాయా లేక ఎక్కువగా ఉన్నాయా అనే సందేహం తలెత్తుతోంది. చిరుతల సంచారంతో అల్లమాయపల్లి, రాంరాయనిపల్లి, హీర్లతండా, దేవబండతండా, సూర్యతండా, వసురాంతండా, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం, షాపురం, ఖిల్లాఘనపురం తదితర గ్రామాల ప్రజలు రాత్రిళ్లు భయంతో బయటకు రావడం లేదు. రాత్రి వేళలో పొలాల దగ్గరకు వెళ్లిన రైతులు ఒకేచోట గుంపుగా చేరి మంటలు వేసుకొని ఉంటున్నారు.



చిరుత జాడలు పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చిరుతను చూశా..



మండల కేంద్రం నుంచి పర్వతాపురం గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే మాకు రైస్‌మిల్ ఉంది. ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రైస్‌మిల్ ఎదుట చిరుత కనిపించింది. భయంతో లోపలికి పరుగులు తీశా.

– నందకిశోర్, సోలీపురం

బంధించేందుకు యత్నిస్తున్నాం..

మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఉన్న గుట్టల్లో చిరుత సంచరిస్తుండటంతో బంధించేందుకు యత్నిస్తున్నాం. ఆవాసం ఏర్పాటు చేసుకోకుండా రోజుకో గుట్టపై తిరుగుతూ జీవాలపై దాడి చేస్తోంది. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో కనిపించడం లేదు. కదలికలను పరిశీలించి బోను ఏర్పాటు చేస్తాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– భాస్కరాచారి, ఫారెస్టు రేంజ్ అధికారి, ఖిల్లాఘనపురం

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ఆంజనేయులు(ఫైల్)

అడ్డాకుల: మండలంలోని కాటవరం శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గుడిబండకు చెందిన వడ్డె నారాయణ కుటుంబం కొన్నేళ్ల క్రితం అడ్డాకులకు వచ్చి స్థిరపడింది. నారాయణకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు వడ్డె ఆంజనేయులు డ్రైవర్‌గా పని చేసేవాడు. శనివారం అర్ధరాత్రి బైక్‌పై అడ్డాకుల నుంచి గుడిబండకు వెళ్తుండగా కేజీఎన్ దాబా సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుపైపడి తల పగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఊట్కూరు: పురుగుమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఊట్కూరు మండలం చిన్నపొర్లలో చోటుచేసుకుంది. ఎస్ఐ గోకరి వివరాల మేరకు.. చిన్నపొర్లకు చెందిన నర్సింహ (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. సోదరుడు కొండన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి మడుగులో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ చెందిన రాములు(60) శనివారం ప్రమాదవశాత్తు గ్రామ శివారులోని రిజర్వాయర్ కాల్వ నీటి గుంతలో పడి దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య పద్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ బాబు తెలిపారు.

ప్రయాణికురాలి పర్సులో నగదు చోరీ

జడ్చర్ల: ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ఓ ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న నగదు చోరీ చేసిన ఘటన స్థానిక కొత్త బస్టాండ్‌లో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలు రాధిక తెలిపిన వివరాల మేరకు.. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాధిక తన కుమారుడిని వెంటపెట్టుకుని హైదరాబాద్ వెళ్లేందుకు కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తి తన చేతి బ్యాగులో ఉన్న దాదాపు రూ.13 వేలు నగదును అపహరించాడు. వెంటనే తేరుకుని బ్యాగును సరిచూసుకోగా డబ్బు కనిపించలేదు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

శాంతినగర్: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుబడిన ఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకలలో ఆదివారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొంకలకు చెందిన బోయ వీరేశం పీడీఎస్ బియ్యం నిల్వ చేశాడనే సమాచారంతో సిబ్బందితో చేరుకుని దాడి చేశామన్నారు. నిల్వ బియ్యం సేకరించిన ఇద్దరు కూలీలు, ఇంటి వద్ద బియ్యం నిల్వ చేసిన పాండుపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు. మొత్తం 24 బస్తాలు సుమారు 12 క్వింటాళ్ల సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని పెగడబండ గ్రామానికి చెందిన రాము ఆదివారం తెల్లవారుజామున కృష్ణా మండలం గుడేబాల్లూర్‌కి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మార్గమధ్యలో పెట్రోలింగ్‌కు వెళ్లిన డయల్ 100సిబ్బంది కృష్ణప్రసాద్ అనుమానం వచ్చిన ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా ఇసుక ఉండటంతో వెంటనే ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తెలుసుకుని ట్రాక్టర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరిలించినట్లు తెలిపారు. ఈ విషయంపై కృష్ణ ప్రసాద్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ మల్లేష్, డ్రైవర్ రాముపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుందుభీ వాగు నుంచి

మిడ్జిల్: మున్ననూర్ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఆదివారం సాయంత్రం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగుకు విరామం


నీళ్లు లేక వెలవెలబోతున్న కృష్ణానది

- ఎత్తిపోతల పథకాలకు అందని నీళ్లు
- ఎండుతున్న వరిపంట
- ఆందోళనలో అన్నదాతలు
- కృష్ణానదిలో నీళ్లు లేకపోవడంతో క్రాప్‌హాలిడే ప్రకటిస్తున్న గ్రామాలు

కృష్ణా: కృష్ణా పరీవాహక రైతులు క్రాప్‌హాలిడే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈఏడాది వార్షాభావ పరిస్థితులు నెలకొనడం.. ఎత్తిపోతల పథకాలకు సాగునీళ్లు అందకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. ఇక జీవనది కృష్ణా సైతం నీళ్లు లేక వెలవెలబోతుండటంతో రైతులు పంటల సాగుకు సెలవు ప్రకటిస్తున్నారు. గుడెబల్లూర్ ఎత్తిపోతల పథకం కింద దాదాపు 800 ఎకరాల్లో వరిసాగు చేశారు. యాసంగిలో నీటి సమస్య వస్తుందని గ్రహించిన రైతులు.. నెలరోజుల ముందుగానే వరినాట్లు వేశారు. అయినప్పటికీ సాగునీటి సమస్య వెంటాడుతోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా కృష్ణానదిలో నీటి జాడ కరువైంది. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటిని కూడా కర్ణాటక ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటుండటంతో సాగునీటి కష్టాలు అధికమయ్యాయి. మరోవైపు ప్రకృతి సిద్ధంగా కృష్ణానది కర్ణాటక వైపు తగ్గ ఉండటం.. తెలంగాణవైపు ఎత్తుగా ఉండటంతో అటు వైపే నీళ్లు వెళ్తున్నాయి. దీంతో ఎత్తిపోతల పథకాల కింద పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏటేటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం..

నదీ తీరంలోని ఎత్తిపోతల పథకాల కింద ప్రతి ఏడాది సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. వానాకాలంలో గుడెబల్లూర్ ఎత్తిపోతల పథకం కింద 3వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా.. కేవలం 800 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేశారు. యాసంగిలో కేవలం తిండిగింజల కోసం 400 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ముడుమాల్ ఎత్తిపోతల పతకంలో కూడా 3 వేలకుపైగా సాగు కావాల్సి ఉండగా.. కేవలం 300 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. కాళహళ్లి ఎత్తిపోతల పథకం కింద 2,500 ఎకరాలు సాగుకావాల్సి ఉండగా.. ప్రస్తుతం 200 ఎకరాల్లో సాగు చేశారు. ఆత్మకూర్ మండలంలోని అమరచింత ఎత్తిపోతల పథకం, జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద కూడా ప్రతి సంవత్సరం సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది.

బీడుగా పొలాలు..

కృష్ణానదిలో నీళ్లు లేకపోవడంతో మాగనూర్, కృష్ణా మండలాల్లోని నదీతీరం రైతులు వరి సాగు చేయకుండగా పొలాలను బీడుగా వదిలివేశారు. కొన్ని గ్రామాల రైతులు క్రాప్‌హాలిడే ప్రకటించారు. కృష్ణా మండలంలోని కుసుమర్తి, సూకూర్, లింగంపల్లి, మాగనూర్ మండలంలోని కొల్పూర్, పుంజనూర్ గ్రామాల్లోని ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయి. 15–20 ఏళ్లల్లో పంటసాగు చేయకుండగా వదిలివేయడం ఇదే మొదటిసారి అని రైతులు అంటున్నారు.


గుడెబల్లూర్ ఎత్తిపోతల పథకం కింద నెర్రెలిచ్చిన వరిపొలం

పంట ఎండుతుంది..



నేను రెండెకరాల్లో వరిసాగు చేశాను. కృష్ణానది వట్టిపోవడంతో ఎత్తిపోతల పథకం నుంచి నీళ్లు అందడం లేదు. దీంతో పంట మొత్తం ఎండిపోతుంది. ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి.

– చెవిటోళ్ల వెంకన్న, రైతు, గుడెబల్లూర్

దిగువకు నీటిని వదలాలి..



కృష్ణానది ఎగువన ఉన్న కర్ణాటక ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని వదిలేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. మన ప్రాంతంలో ఎగువన ఓ చిన్నపాటి ప్రాజెక్టు కట్టినా రైతులకు సాగునీటి కష్టాలు ఉండవు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి.

– కొలిమి వెంకటేష్, రైతు, గుడెబల్లూర్



గుడెబల్లూర్ ఎత్తిపోతల పథకం

కృష్ణానది ఆధారంగా 15 ఎత్తిపోతలు..

రాష్ట్రంలో కృష్ణానది అడుగుపెడుతున్న తంగిడి గ్రామం నుంచి మొదులకొని జూరాల ప్రాజెక్టు వరకు మక్తల్, ఆత్మకూర్, మాగనూర్ మండలాల్లో మొత్తం 15 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. యాసంగిలో ఆయా ఎత్తిపోతల పథకాల కింద 8,500, జూరాల ఎడమకాల్వ కింద 12వేల ఎకరాలు వరిసాగు అవుతుందని ఐడీసీ వారి లెక్కలు చెబుతున్నాయి. దీంతో పాటు నదీ తీరంలోని రైతులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న పంప్‌ల ద్వారా మరో 20వేల ఎకరాల వరకు వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారుల అంచనా. ప్రస్తుతం కృష్ణానది వట్టిపోవడంతో ఎత్తిపోతల పథకాలకు సాగునీళ్లు అందడం లేదు. దీంతో వరిపంట ఎండిపోతోంది. కొందరు రైతులు వేలాది రూపాయలు వెచ్చించి బోరుబావులు తవ్విస్తున్నారు. భూగర్భజలంతో పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

భూగర్భ కేంద్రం పరిశీలన


భూగర్భ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

- నాలుగో యూనిట్ ప్రమాదంపై ఆరాతీసిన మంత్రి రాజనర్సింహ

దోమలపెంట: టీఎస్ జెన్‌కో పరిధిలోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రాన్ని ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి పరిశీలించారు. కేంద్రం ఎస్ఈ (ఓఅండ్‌ఎం) ఆదినారాయణ కేంద్రంలో యూనిట్ల పనితీరు, విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కేంద్రం మొత్తాన్ని కలియతిరిగి పరిశీలించారు. గతంలో నాలుగో యూనిట్ ఎలా ప్రమాదానికి గురైందని అడిగి తెలుసుకున్నారు. మెయిన్ కంట్రోల్ రూంలో విద్యుదుత్పత్తి నిర్వహణ గురించి ఆరాతీశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజినీర్లతో కొద్దిసేపు మాట్లాడారు. సివిల్ ఎస్ఈ రవీంద్రకుమార్, ఈఈ రమేష్, డీఈలు శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రావు, రమేష్, జనార్దన్ పాల్గొన్నారు.

■ దోమలపెంటలో సరైన వైద్యసేవలు అందడం లేదని, శ్రీశైలానికి రాకపోకలు సాగిస్తున్న భక్తులు, పర్యాటకులు రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వంశీకృష్ణ మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేసి భూమిపూజ చేశారు. అధికారులు త్వరితగతిన సెంటర్ పనులతోపాటు వైద్య సిబ్బందికి క్వార్టర్స్ కూడా నిర్మించాలని, వీటిని వర్షాకాలం వచ్చేలోగా పూర్తిచేయాలని ఆదేశించారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

శాంతినగర్: బొలెరో వాహనాన్ని అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదైనట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే జిల్లెడుదిన్నెకు చెందిన హరిజన మారెన్న (65), దుబ్బన్నలు శుక్రవారం పత్తి లోడ్ చేయడానికి బొలెరో గూడ్స్ వాహనంలో కంచుపాడు గ్రామానికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా శివశివాని స్కూల్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. మారెన్నకు తీవ్రగాయాలయ్యాయి. దుబ్బన్నకు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరిని 108లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మారెన్న మృతిచెందాడు. మారెన్న భార్య హరిజన జయమ్మ ఆదివారం శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో తన భర్త చావుకు పోతులపాడుకు చెందిన వాహన డ్రైవర్ వీరేష్ కారణమని, అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని ఫిర్యాదు చేసింది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- పత్తి తీసిన తర్వాత మొక్కలను భూమిలో కలియదున్నాలి
- వంట చెరుకుగా వినియోగించేందుకు నిల్వ చేయొద్దు

అలంపూర్: పత్తి పంట తీసిన తర్వాత రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ సూచించారు. బీటీ సాంకేతిక పరిజ్ఞానం రాక ముందు పత్తిని వివిధ రకాల కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపర్చడం జరిగిందని తెలిపారు. 2002 సంవత్సరం నుంచి బీటీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత కాయ తొలుచు పురుగుల ఉధృతి చాలా వరకు తగ్గిందన్నారు. పత్తి పంట తొలగించిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు.

గులాబీ పురుగు: గులాబీ రంగు పురుగు లేత కొమ్మలు, పూలమొగ్గలు, లేత కాయలపై గుడ్లను విడివిడిగా 150 నుంచి 200 వరకు పెడుతుంది. గుడ్ల నుంచి పొదగబడిన పిల్ల పురుగులు పూల మొగ్గలోకి తొలుచుకొనిపోయి లోపలి పదార్థాలను తిని, వీటిని గుడ్డిపూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలకు కనిపించనంత చిన్న రంధ్రాలు చేసి లోపలికి ప్రవేశిస్తాయి. తర్వాత కాయలకు చేసిన రంధ్రాలు పూడిపోయి, పురుగు కాయలోనే ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతినడమే కాకుండా దూది బరువు ఘననీయంగా తగ్గుతుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడపడం వల్ల కాయ పగిలిన తర్వాత నష్టాన్ని గుర్తించగలం. పురుగులు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి.


కోత కోసిన పత్తి పంట

పాడి-పంట
అధికారి సలహా: సక్రియ నాయక్, ఏడీఏ, అలంపూర్

నివారణ చర్యలు: సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించి గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ప్రధానంగా పంట తీసిన తర్వాత, పంట లేని సమయాన, విత్తడానికి ముందు, పంట కాలంలో వివిధ చర్యలు చేపట్టాలి.

పంట తీసిన తర్వాత చేపట్టాల్సిన చర్యలు..

పత్తి తీసిన తర్వాత గొర్రెలు, మేకలు, పశువులతో మేపాలి. పత్తి మోళ్లను ట్రాక్టర్ రోటవేటర్‌తో భూమిలో కలియదున్నాలి. నీటి వసతి ఉన్నప్పటికీ, పత్తిని ఆరు నెలలకు మించి పొడిగించకుండా తీసివేయాలి. పంటకాలం పొడిగించడం వల్ల రాబోయే పంటలో పురుగు ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. నీటి వసతి ఉన్న చోట రెండవ పంటగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి. పత్తి మోళ్లను వంట చెరుకుగా వాడేందుకు నిల్వ చేయకూడదు. పత్తి తీసిన తర్వాత ఎండిన మోళ్లు, విచ్చుకున్న కాయలను భూమిలో కలియదున్నడం వల్ల పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చు.

పంట లేని సమయంలో..

ఎండాకాలంలో లోతు దుక్కులతో పురుగు కోశస్థ దశలను సమర్థవంతంగా నాశనం చేయవచ్చు. గులాబీ రంగు ఆశించిన పత్తిని జిన్నింగ్ చేయగా.. వచ్చిన విత్తనాలను నిల్వ చేయవద్దు. లేనిపక్షంలో తర్వాతి పంట కాలంలో దీన్ని ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. గులాబీ రంగు పురుగు ఆశించిన పత్తిని రైతుల ఇళ్ల వద్ద గాని జిన్నింగ్ మిల్లుల వద్ద గాని నిల్వ ఉంచకూడదు.

పత్తి విత్తడానికి ముందు..

పంట మార్పిడి పద్ధతిని రెండు లేక మూడు సంవత్సరాలకో సారి విధిగా పాటించాలి. తక్కువ కాలం పరిమితి గల రకాలను ఎంపిక చేసుకుని, సకాలంలో విత్తుకోవడం వల్ల గులాబీ రంగు పురుగు ఉధృతిని చాలా వరకు తగ్గించవచ్చు. బీటీ పత్తి విత్తే సమయాల్లో చుట్టూ 5 వరుసల్లో నాన్ బీటీ పత్తిని విధిగా విత్తుకోవాలి. పత్తి పొలం, చేను చుట్టూ తుత్తురు బెండలాంటి కలుపు మొక్కలు లేకుండా ఉండాలి. పత్తిచేను సమీపంలో బెండ పంట లేకుండా చూసుకోవాలి.

పంట కాలంలో..

పత్తి పంట విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చాలి. బుట్టలలో వరుసగా మూడు రోజులు 7 లేదా 8 తల్లి పురుగులు పడటం గమనించినట్లయితే 10శాతం గుడ్డి పూలు లేదా 10 శాతం పురుగు ఆశించిన కాయలను గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి పూలను ఏరి నాశనం చేయాలి. పురుగు ఉధృతి ఆర్థికనష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేసుకోవాలి.

ఉపాధికి కసరత్తు


మహబూబ్‌నగర్ రూరల్ మండలం పోతన్‌పల్లి జపాన్ చెరువులో ఒండ్రుమట్టి తీస్తున్న కూలీలు (ఫైల్)

- 2024–25 సంవత్సరానికి మండలాల వారీగా ప్రణాళిక
- షెడ్యూల్ ప్రకారం ఈ నెలాఖరు నాటికి గ్రామసభలు పూర్తి
- కొత్త పనులు చేపట్టాలంటే.. పాతవి పూర్తిచేయాల్సిందే

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో కేంద్రం ప్రభుత్వం మరో కీలక మార్పు చేసింది. ఇప్పటి వరకు ఈ పథకం పనుల గుర్తింపు విధివిధానాల ప్రకారం జరిగేది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో అవసరమైన పనులను గ్రామసభల ద్వారా తీర్మానం చేసి చేపడతారు. పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీ చూసుకుంటుంది. ఇందుకు జిల్లావ్యాప్తంగా అధికారులు కూలీలతో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మండలాల తర్వాత జిల్లా ప్రణాళికలు తయారు చేయనున్నారు. ఈ పనులకు సంబంధించిన వివరాలను కేంద్రం ఆ.దీనంలో ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. అలాగే ఒక గ్రామంలో ఎక్కువ.. ఇంకో గ్రామంలో తక్కువ పనులు చేపట్టకుండా కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. ఈ మేరకు ఒక గ్రామంలో 20 పనులకు మించి ఒకేసారి చేపట్టవద్దు. కొత్త పనులు చేయాలంటే.. అప్పటికే ప్రారంభించినవి పూర్తి చేయాల్సి ఉంటుంది. అలాగే కూలీల హాజరు సైతం ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. ఇప్పటి వరకు ఉన్న జీరో బ్యాంకు ఖాతాలకు స్వస్తిపలికి.. కొత్తగా తీసిన కూలీల ఖాతాల వివరాలు అందించాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామసభల ద్వారా..

ఏటా అక్టోబర్ 2 నుంచి జనవరి 31 వరకు ఆర్థిక సంవత్సరానికి కూలీలకు సరిపడా పనులు గుర్తిస్తారు. ప్రాధాన్యత క్రమంలో వాటి అమలుకు నిర్ణయాలు తీసుకోవాలి. ఇందుకు అధికారులు షెడ్యూల్ ప్రకారం ప్రతి పంచాయతీలో గ్రామ సభలు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయనున్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రణాళిక ఆమోదం పొందాల్సి ఉంటుంది. జిల్లా ప్రణాళికలను ఈ నెల 31వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు.

సూచనలు పరిగణలోకి..

ఇంతకు ముందు గ్రామసభ తీర్మానం ప్రకారమే ఉపాధి పనులు చేపట్టినప్పటికీ అధికారులు గుర్తించి ప్రణాళిక ప్రకారం ఎక్కడ ఎలాంటి పనులు చేయాలో నిర్ణయించేవారు. ప్రస్తుతం గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూలీల విన్నపాలు కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. దీంతో కూలీల సంఖ్య పెరగడంతోపాటు అవసరమైన అభివృద్ధి పనులు జరిగే అవకాశం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో ఏయే పనులు చేపట్టాలో అధికారులు పరిశీలిస్తున్నారు. కొన్ని మండలాల్లో గుర్తింపు సైతం పూర్తయ్యింది. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, ఎంపీడీఓ బృందాలుగా పర్యటించి గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నారు.

20 పనులు మాత్రమే ..

హరితహారం, మొక్కలు నాటడం, చెరువుల్లో పూడిక తీసి పొలాలకు తరలించడం, రైతుల పంట కల్లాలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, మట్టి రోడ్డు వేసుకోవడం, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు, రహదారుల అనుసంధానం, పంట నూర్పిడి, నీటి నిల్వ గుంతలు ఇలా 250 రకాల పనుల్లో గ్రామసభల్లో ఆమోదం తెలిపిన 20 పనులు మాత్రమే చేపట్టనున్నారు.

హాజరు తప్పనిసరి..

కూలీల హాజరుకు ఆన్‌లైన్ తప్పనిసరి చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్ సెల్‌ఫోన్‌లో కూలీల మస్టర్‌తో కూడిన వివరాలు నమోదు చేస్తారు. పని ప్రదేశంలో రోజుకు రెండుసార్లు రెండు ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉదయం 9, సాయంత్రం 5 గంటలకు ప్రతి కూలీ మస్టర్ విధిగా సంతకం చేయాలి. రెండు సంతకాలు ఉంటేనే రూ.257 కూలీ చెల్లిస్తారు.

నిబంధనల ప్రకారం..



జిల్లాలో వచ్చే ఆర్థిక సంవత్సరం చేపట్టే కొత్త ఉపాధి హామీ పనులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుంది. గ్రామసభలు ఈ నెల చివరి నాటికి పూర్తి చేసి జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి లభించేలా కృషిచేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు కల్పిస్తున్నాం. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా కూలీల హాజరును పని ప్రదేశం నుంచి నమోదు చేస్తున్నారు.

– యాదయ్య, డీఆర్‌డీఓ

పుడమి సాహితీ సేవలు అభినందనీయం

- ఏపీ తెలుగు అకాడమీ ఛైర్మన్ లక్ష్మీపార్వతి


కర్నె శిరీష (బర్రెలక్క)ను సన్మానిస్తున్న లక్ష్మీపార్వతి

రామగిరి (నల్లగొండ): పుడమి సాహితీ సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఛైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పుడమి సాహితీ వేదిక 5వ వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లుగా 200 మందికి పురస్కారాలు అందించడం గొప్ప విషయమని, తెలుగు సాహిత్యాన్ని ఎప్పుడూ మర్చిపోలేమన్నారు. తెలుగు భాషను భారతదేశంలోనే రెండో జాతీయ భాషగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గుత్తా మోహన్‌రెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కాసాల నర్సిరెడ్డి, కర్నె శిరీష (అలియాస్ బర్రెలక్క), ఎండీ మునీర్ అహ్మద్ షరీఫ్, ఇటిక్యాల జగన్‌మోహన్ రెడ్డి, గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ, అప్పనపల్లి భాస్కరాచారి, గాయం నారాయణరెడ్డి, వాకిటి రాంరెడ్డి, పెరుక రాజు, ఎజ్జు మల్లయ్య, మాగంటి ప్రసాద్, చలమల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం


అంబులెన్స్‌లో మగబిడ్డతో తల్లి శ్రావణి

అమరచింత: పురిటి నొప్పులతో బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళకు ఆస్పత్రిలో ప్రసవానికి ఇబ్బంది ఉందని వైద్యులు జిల్లా ఆస్పత్రికి 108లో తరలించగా.. మార్గమధ్యలో మగ బిడ్డకు జన్మనిచ్చిన ఘటన అమరచింతలో చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన వలస కూలీలు స్థానికంగా చెరుకు కటింగ్ పనుల కోసం వచ్చారు. శనివారం రాత్రి శ్రావణి పురిటి నొప్పులతో అమరచింతలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. శ్రావణిని అక్కడి నుంచి ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి ప్రథమ చికిత్స అందించి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. 108లో జిల్లా ఆస్పత్రికి శ్రావణిని తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమై మగబిడ్డను ప్రసవించింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని టెక్నీషియన్ యశోద, పైలట్ రాము తెలిపారు.

వారంలో రెండోసారి..

అమరచింత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రసవానికి వచ్చిన మహిళలకు సరైన వైద్య సేవలు అందించలేని స్థితి దాపురించింది. ముఖ్యంగా ఎంబీబీఎస్ డాక్టర్ లేక పోవడంతో ఇక్కడి సిబ్బంది ప్రసవాలను తప్పించుకునేందుకు జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఆరు రోజుల కిందట ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చిన మహిళను వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో కవల పిల్లలకు జన్మనిచ్చింది. అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తెలిసిన వైద్య సేవలు ఆస్పత్రిలో ఉన్న వారికి తెలియకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

కార్యవర్గం ఎన్నిక

పెబ్బేరు రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశపాగ మహేష్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

కొత్తకోట: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఈనెల 23న నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

వనపర్తిటౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంలో కంట్రోల్ రూం 7382605903 ఏర్పాటు చేశామని డివిజనల్ ఇంజినీర్ ఎం.నరేంద్రకుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోక కంట్రోల్ రూం 7382614830 నంబర్‌తో డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఏవైన విద్యుత్ సమస్యలు ఉంటే కంట్రోల్ రూంను సంప్రదించాలని కోరారు.

ఘనంగా హాజీమాలంగ్ బాబా గంధోత్సవం



అమరచింత: సయ్యద్‌షా హాజీమాలంగ్ బాబా గంధోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండలంలోని మస్తీపురం శివారులోని గుట్టలపై వెలసిన దర్గా షరీఫ్ ఉర్సోత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగనున్నాయి. మొదటి రోజు ఆదివారం గంధోత్సవం పట్టణంలోని పెద్దపీర్ల మసీదు నుంచి కొనసాగింది. పట్టణ పురవీధుల గుండా గంధం ఊరేగింపును మస్తీపురంలోని దర్గాకు తరలించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. సోమవారం ఉర్సు సందర్భంగా భక్తులు కందూర్లు నిర్వహించి బాబాకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. దర్గాకు వస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించామని నిర్వాహకుడు ముర్షద్ మైనోద్దీన్ తెలిపారు.

బాధితుడికి పరామర్శ



పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాజశేఖర్‌గౌడ్ కుమారుడు రేవంత్‌గౌడ్ నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి ఆదివారం వనపర్తిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తునట్లు సమాచారం అందింది. రామగిరి గ్రామానికి చెందిన మద్దెలబండ మల్లేష్, గౌరారం గ్రామానికి చెందిన వనం సాయికుమార్, నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్ల గ్రామానికి చెందిన భాషమోని జంగయ్యలు అక్రకమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. గౌరారం గేటు వద్ద ట్రాక్టర్లను పట్టుకునట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

ఉచిత గురుకుల కోచింగ్ ప్రారంభం

కందనూలు: పట్టణంలో డిగ్రీ కళాశాలలో 'తెనుగోళ్ల విద్యావంతుల వేదిక' అధ్యక్షుడు పెబ్బేటి మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గురుకుల కోచింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి, పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని ఉచితంగా కోచింగ్ ఇస్తునట్లు పేర్కొన్నారు. మెటీరియల్‌కు కూడా అందిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావ్‌పల్లిలో చాకలి ఐలమ్మ, శ్రీకాంతాచారి విగ్రహాల ఏర్పాటు కోసం ఆదివారం గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లోజి అరవిందాచారి మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనాలు కరువు



ఏదుల ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- మండలంలో 24 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు భవనాల్లోనే కొనసాగుతున్న వైనం
- వాటిల్లోనూ వసతులు కరువు

గోపాల్‌పేట: చిన్నపిల్లలు బాల్యంలో చదువుకునేందుకు మొదట అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి తమ చదువును ప్రారంభిస్తారు. అన్ని సౌకర్యాలు ఉండి పిల్లలకు అనుకూలంగా ఉంటేనే కేంద్రానికి వస్తారు. కానీ చిన్నపిల్లలకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు సొంత భవనాలు లేకపోవడంతో చిన్నారులు చదువుకునేందుకు కేంద్రాలకు ఎలా వస్తారని తల్లితండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయంపై ఇటీవల మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి.. మండలంలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, ఉన్నవాటిలో కనీస సౌకర్యాలు లేవని తెలుసుకుని వెంటనే కొత్త భవనాల నిర్మాణానికి కార్యాచరణ ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

33మెయిన్, 7 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు..

మండలంలో 40 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 33 మెయిన్ కాగా, 7 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో బుద్దారం రెండు, మూడు, నాలుగో కేంద్రం, ధర్మతండా, ఏదుల నాలుగో కేంద్రం, గోపాల్‌పేట ఒకటి, రెండో కేంద్రం, కర్ణమయ్యకుంట తండా కేంద్రాలు అద్దెకు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నారు. వీటిలో కనీస వసతులు లేవు. అలాగే బుద్దారం ఒకటో కేంద్రం, రెండు, చెన్నూర్ మూడో కేంద్రం, చెన్నూర్‌తండా, గోపాల్‌పేట ఐదు, పొలికెపాడు ఒకటి, రెండో కేంద్రాలు, ఆముదాలకుంట, ధన్‌సింగ్‌తండా, ఏదుట్ల ఒకటి, రెండు, ఏదుల ఒకటో కేంద్రం, ఎర్రగట్టుతండా, జాంప్లతండా, చాకల్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్‌లో కొనసాగుతున్నాయి. ఇవి కాకుండా 16 కేంద్రం సొంత భవనాల్లో ఉండగా అందులో తిర్మలాపూర్, ఏదుల మూడో కేంద్రాల్లో మూత్రశాలలు లేవు. తాడిపర్తి ఒకటో కేంద్రంలో నీటి సమస్య ఉంది. పొలికెపాడులో రెండో, నాలుగో కేంద్రాల్లో కొత్త భవనాలు కట్టినా, అక్కడ చిన్నపిల్లలకు ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు చెప్పారు. మున్ననూరులోని ఒకటో కేంద్రంలో నీటి సమస్య ఉందని స్థానికులు తెలిపారు.

16 సొంత భవనాలు..



మండలంలో మొత్తం 40 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా అందులో 16 సొంత భవనాలు ఉన్నాయి. తొమ్మిది అద్దెగా ఉండగా, 15 పాఠశాలలు, ఇతర కమ్యూనిటీ భవనాల్లో నడుస్తున్నాయి. కొన్ని సెంటర్లలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అధికారులకు గతంలోనే సమాచారం ఇచ్చాం. తొందరలోనే కొత్త భవనాలు ఏర్పాటు చేస్తారని తెలిసింది.

– రాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, గోపాల్‌పేట

త్వరలోనే పనులు

మండలంలో ఇటీవల సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రాల ఇబ్బందుల వివరాలు ఇవ్వాలని అడిగారు. మేము తొమ్మిది పాఠశాలల భవనాలకు సంబంధించి నివేదిక ఇచ్చాం. ఇప్పటికే 15 రోజులైంది. తొందరలోనే డబ్బులు మంజూరు అయితే అధికారుల సూచన మేరకు టెండర్లు పిలిచి భవనాల నిర్మాణాలు చేపడుతాం.

– భాస్కర్, పంచాయతీరాజ్ ఏఈ, గోపాల్‌పేట

నేటి నుంచి సుందరగిరి ఉత్సవాలు



సుందరగిరి గుట్టుపై కొలువుదీరనున్న ఉత్సవ విగ్రహాలు



ఉత్సవ విగ్రహాలను గుట్టపైకి తీసుకొస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల శివారులో గల సుందరగిరి గుట్టపై వెలిసిన పరమేశ్వర స్వామిడి బ్రహ్మోత్సవాలు, జాతర సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు పరమేష్, విజయ్, సంపత్ తెలిపారు. ప్రతి ఏడాది పుష్యమాసంలో పౌర్ణమికి దగ్గరగా ఉండే సోమవారం స్వామి వారి ఉత్సవాలు నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. జాతర సందర్భంగా ఆదివారం రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సుందరగిరి గుట్టపైకి పల్లకీ సేవలతో తీసుకొస్తారు. సోమవారం ఉదయం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు, మహానైవేద్యం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించడంతో పాటు రాత్రి 9గంటలకు స్వామి వారికి నందికోళ్ల సేవ ఉంటుందని, జాతరకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం తెల్లవారుజాము 4గంటలకు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి వారి భక్తిని చాటుకుంటారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మాధరావుపల్లి సర్పంచ్ సునీత అన్నారు. ఆదివారం వైద్య శాఖ, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన, స్వచ్ఛభారత్, పీఎం స్వానిధి, ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, పెన్షన్లు వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీరాం, ఏఎన్‌ఎం సుమిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాధరావుపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రామికుల రాజ్యం ఏర్పాటుకు పోరాటం



వనపర్తి జిల్లా కేంద్రంలో లెనిన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అమరచింత: పెట్టుబడిదారుల పాలన నుంచి పేదల ప్రజలు కోరుకున్న రాజ్యంతోపాటు శ్రామికుల హక్కుల కోసం పోరాటిన మహాయోధుడు లెనిన్ అని మున్సిపల్ వైస్ చైర్మన్, సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి అన్నారు. లెనిన్ శత వర్ధంతిని పురస్కరంచుకుని ఆదివారం పట్టణంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారల్‌మార్క్స్ రచించిన పెట్టుబడి గ్రంథాన్ని అన్ని భాషల్లో ప్రింటింగ్ చేయించి ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తిగా చరిత్రలో లెనిన్ మిగిలిపోయారన్నారు. 1917లో రష్యాలో విప్లవం సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. నిరంతరం పేదలు, శ్రామికుల బాగోగుల కోసం పోరాటం చేశారని అలాంటి మహానుభావుడి ఆశయాలను నేటి తరం యువకులు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, ఆర్‌ఎస్.రమేష్, కాకి శ్రీనివాసులు, మల్లేష్, రవి, విజయ్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ వర్ధంతి..

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం లెనిన్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జబ్బార్, పుట్టా ఆంజనేయులు, మేకల ఆంజనేయులు, లక్ష్మి, మదన్, గట్టయ్య, బీసన్న, పరమేశ్వరచారి, రాములు, సాయిలీల, రమేష్ పాల్గొన్నారు.



అమరచింతలో..

వీపనగండ్ల: ప్రపంచ కమ్యూనిస్ట్ మహానేతలలో ఒకరైన కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు నిర్వహించారు. ప్రపంచంలో కార్మిక, కర్షకుల హక్కుల కోసం అంకితభావంతో అలుపెరగని పోరాటాలు చేసిన మహనీయులు లెనిన్ అని మండల కార్యదర్శి బాల్‌రెడ్డి తెలిపారు.

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన



పాన్‌గల్‌లో ఓటరు నమోదు అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో మొత్తం 377 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఆదివారం ఆయన మామిడిమాడ, అప్పారెడ్డిపల్లి, మల్కిమబియాన్‌పల్లిలో పర్యటించి నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో కొత్తగా ఓటరుగా పేరు నమోదు కోసం 157 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పేర్లు, చిరునామా తదితర మార్పులు, చేర్పుల కోసం మొత్తం 220 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అదేవిధంగా 12 మంది మృతి చెందిన వారిని గుర్తించామన్నారు. అర్హులైన వారు 22న కూడ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు.

పాన్‌గల్: ప్రత్యేక ఓటరు నమోదులో కొత్త ఓటరు నమోదులో ఎలాంటి తప్పులు చోటుచేసుకోకుండా పకడ్బందీగా నమోదు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ అశోక్ సూచించారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు శాగాపూర్‌లో ఆయన పర్యటించి నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో 29 మంది కొత్త ఓటరు నమోదుకు, పేర్లు, అడ్రస్ తదితర మార్పులు, చేర్పుల కోసం47మంది దరఖాస్తులు చేసుకున్నట్లు డీటీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు మహేష్, తిరుపతయ్య, బీఎల్ఓలు పాల్గొన్నారు.

అమరచింత: 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోవాలని ఇందు కోసం ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సహకరించాలని తహసీల్దార్ చాంద్‌పాషా కోరారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పురస్కరంచుకుని పట్టణంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటరు దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి రెండో రోజు 30 మంది దరఖాస్తులు సమర్పించారు. రెండు రోజులుగా 50 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. ఆదివారం ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా శిబిరాలను సందర్శించి బీఎల్ఓలతో వివరాలు సేకరించారు. రెండురోజులపాటు గ్రామాల్లో పర్యటించి 18 ఏళ్ల పూర్తయిన వారి వివరాలను సేకరించి ఓటు హక్కుకోసం నమోదు చేయించామని వివరించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్ఓలు ఉన్నారు.



అమరచింతలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా



ఆత్మకూర్‌లో బీఎల్ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

ఎడమ కాల్వకు నీటి విడుదల



రామన్‌పాడు ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తున్న నాయకులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడ్ ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా ఆదివారం రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చొరవతో అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. దీంతో అజ్జకొల్లుకు చెందిన 3 చెరువులను నింపుతూ కింది పంటపొలాలకు ఎంతో దోహదపడుతుందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న, వడ్డే కృష్ణ, సాయిబాబ, తిరుపతిరెడ్డి, అంజద్‌అలీ, శ్రీధర్‌రెడ్డి, విజయ్ రైతులు పాల్గొన్నారు.

ఎంపీ స్థానం గెలుపొందడం ఖాయం



ఆత్మకూర్ నుంచి మక్తల్‌కు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందని, ఎంపీ స్థానం గెలవడం కావడం ఖాయమని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మక్తల్ పట్టణంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి మండలం నుంచి శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. బీజేపీ, బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపాలు కావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని దేశప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్, పరమేష్, శ్రీను, శ్రీనివాస్, సాయిరాఘవ, చాయపత్త జావేద్, గంగ, అజ్మతుల్లా, మస్తాన్, దస్తగిరి, పాండురంగ, అబ్దుల్లా తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



నాగరాజు భార్యకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న మిత్రులు

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన విద్యార్థులు ముగ్గురు మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు తోటి మిత్రులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. తూముకుంటకు చెందిన నల్లపోతుల నాగరాజు ఇటీవల మృతి చెందగా అతని భార్య శిరీషకు రూ.50వేలు, నార్లాపూర్ చెందిన వేముల రాజవర్ధన్‌గౌడ్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు రూ.30వేలు, తూముకుంటకు చెందిన వడ్ల అశోక్ మృతిచెందగా వారి కుటుంబానికి రూ.30వేల నగదు అందించారు. కార్యక్రమంలో రాముడు, శేఖర్, కరుణాకర్, సురేందర్‌గౌడ్, మన్యం, ఆంజనేయులుగౌడ్, రత్నయ్య, రాముడు, బీరయ్య, సురేందర్‌గౌడ్ ఉన్నారు.

ఊరూరా ఆలయాలు ముస్తాబు



సాయిబాబ ఆలయం



ఆత్మకూర్‌లో విద్యుద్దీపాలతో అలంకరించిన ఆంజనేయస్వామి ఆలయం

ఆత్మకూర్: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం, శ్రీరామచంద్ర విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి దీపావళి చేసుకోవాలని నాయకులు కోరారు. ఆదివారం స్థానిక సాయిబాబ మందిరం, ఆంజనేయ స్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రామమందిర ట్రస్ట్ పంపిన అక్షింతలను ఇదివరకే మండలంలోని గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు. సోమవారం స్థానిక బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం భారీ ఎల్ఈడీ ఏర్పాటు చేయనున్నట్లు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తెలిపారు. ఉదయం పట్టణంలోని పురవీధులగుండా శ్రీసీత, రామ, లక్ష్మణుల విగ్రహమూర్తుల భారీ శోభాయాత్ర నిర్వహిస్తున్నామని భక్తులు వేలాదిగా పాల్గొనాలని కోరారు.

ఆలయాల శుభ్రం..

పెబ్బేరు రూరల్: మండలంలోని రాంపురంలోని ఆలయాన్ని గ్రామస్తులు శుభ్రం చేశారు. గ్రామ ప్రజలు సోమవారం ఏర్పాటు చేసే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మదనాపురం: మండలంలోని తిరుమలపల్లిలో ఆదివారం చిన్నారులు శ్రీరాముడి జెండాలు పట్టుకొని గ్రామంలో తిరిగారు. ప్రతి ఇంటికి వెళ్లి జెండాను ఇంటిపై పెట్టుకోవాలని సూచించారు.

కాషాయ జెండాల పంపిణీ..

అమరచింత: అయోధ్యలో రాములోరి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరంచుకుని గ్రామాల్లోని దేవాలయాన్ని కృష్ణా జలాలతో అభిషేకించి ఇంటింటికీ కాషాయ జెండాలను పంపిణీ చేశారు. సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ప్రతి హిందువు తమ ఇంటిపై జెండా ఎగురవేయాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పూజలు నిర్వహించాలని వీహెచ్‌పీ అవగాహన కల్పించారు.



కొంకన్వానిపల్లెలో కాషాయ జెండాలను పంపిణీ చేస్తున్న నాయకులు



తిర్మాలయ్యపల్లిలో జెండాలతో చిన్నారులు

బాబు కోసం బలి!

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చివరి అస్త్రంగా షర్మిల

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీఎంను చేయడం ఎలా? అన్నదే షర్మిల లక్ష్యంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక అన్ని అస్త్రాలు ప్రయోగించిన చంద్రబాబు చివరి ప్రయత్నంగా షర్మిలను తీసుకొచ్చారని చెప్పారు. చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడం కోసమే షర్మిల పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి వచ్చారన్నది ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. ఇదంతా చంద్రబాబు ఎత్తుగడేనని చెప్పారు. గతంలో షర్మిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడిన ఎల్లో మీడియా ఇప్పుడు ఆమెను భుజానికెత్తుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. నిన్నటిదాకా తెలంగాణలోనే తన బతుకు, చావు అంటూ వైఎస్సార్ టీపీని నడిపిన షర్మిల ఇప్పుడు హఠాత్తుగా పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి ఎందుకొచ్చారో చెప్పాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉంటే కాంగ్రెస్‌పై ఉమ్మేసేవారంటూ నిన్నటిదాకా తూర్పారబట్టిన షర్మిల ఇప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీకి నేతృత్వం వహించడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీశారు. అడ్డగోలుగా విభజించి ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో నోటాకు 1.28 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు వచ్చాయని సజ్జల గుర్తు చేశారు. అలాంటి కాంగ్రెస్‌ను బతికించడమంటే శవానికి జీవం పోయటమేనని ఎద్దేవా చేశారు. సజ్జల ఏమన్నారంటే...

భాష, యాస బాధాకరం..

పీసీసీ చీఫ్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా షర్మిల మాట్లాడిన భాష, యాస దివంగత వైఎస్సార్ కుటుంబ సన్నిహితులకు, అభిమానులకు, ఆయన ఆశయాల సాధనకు పేటెంట్ కలిగిన వైఎస్సార్‌సీపీ నాయకులకు బాధ కలిగించింది. సీఎం జగన్ మహానేత వైఎస్ తనయుడిగానే కాకుండా రాజకీయ వారసుడిగా, వైఎస్సార్ ఆశయాల సాధనకు ప్రజలతో మమేకమవుతూ నిబద్ధతతో పని చేస్తున్నారు. షర్మిల వ్యవహార శైలి చూస్తే జాలి కలుగుతోంది. కేవీపీ, రఘువీరారెడ్డి మినహా కాంగ్రెస్‌లో షర్మిలకు పరిచయం ఉన్న వారెవరూ లేరు.

ప్రసంగాన్ని తయారు చేసి పంపించారు..

రాష్ట్రంలో ఉనికిలో లేని కాంగ్రెస్ పార్టీకి హఠాత్తుగా అధ్యక్షురాలిగా వచ్చి చంద్రబాబు డైలాగులనే షర్మిల చెబుతుంటే జాలి కలగక మరేం అనిపిస్తుంది? జగన్‌కు మద్దతుగా గతంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న షర్మిల ఇప్పుడు ఆయన నియంత అంటూ విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో 56 నెలలుగా కొనసాగుతున్న సీఎం జగన్ సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పకుండా ఆమె డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి ఎందుకు వచ్చారు? రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యమైతే ఇక్కడకు వచ్చి ఆమె చేయగలిగింది ఏముంది? ఆమె లక్ష్యం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం కాదు.. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ఎలా అన్నదే. వైఎస్ అభిమానుల ఓట్లు చీల్చడానికి షర్మిల తోడ్పడతారన్నదే చంద్రబాబు చివరి ఎత్తుగడ. క్రిస్టియన్ మైనార్టీలు, దళితుల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ప్రసంగాన్ని తయారు చేసి షర్మిలకు ఇచ్చి పంపారు.

ఆ అవసరం, అవకాశం కూడా లేదు..

రాష్ట్రంలో ఉన్నది ఒకటే కాంగ్రెస్ పార్టీ.. అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. హస్తం గుర్తు కాంగ్రెస్ ఎప్పుడో పోయింది. వైఎస్సార్ వారసుడిగా సీఎం జగన్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. రాష్ట్రంలో మైనార్టీలు, క్రైస్తవులు, ఎస్సీలతోపాటు అందరికీ రక్షణ కల్పించే శక్తి, నిబద్ధత తనకుందని పన్నెండేళ్లుగా సీఎం జగన్ రుజువు చేసుకుంటూనే ఉన్నారు. మతం ఏదైనా వ్యక్తిగతంగానే ఉండాలి కానీ రాజకీయంగా, పరిపాలనలో దాని ప్రభావం ఉండకూడదని బలంగా విశ్వసించే వ్యక్తి సీఎం జగన్. ఏ దేవుడ్ని ఎవరు కొలిచినా అన్నిటి భావం ఒకటే అని నమ్మిన వ్యక్తిగా వాటికి అతీతంగా ఉన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా వారిని రక్షించి అక్కున చేర్చుకుంటున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు మన వ్యక్తిగత విశ్వాసాలు కాకుండా రాష్ట్రం అవసరాలు, ప్రజల ఆకాంక్షలే మన రాజకీయ విధానాలను నిర్దేశించాలని సీఎం జగన్ బలంగా నమ్ముతారు. కేంద్రంలో ఎవరున్నా వారితో సమన్వయం చేసుకుంటూ వీలైనంత వరకూ రాష్ట్రానికి మేలు చేయాలని భావిస్తారు. సీఎం జగన్ చెల్లెలుగా, మహానేత వైఎస్ కుమార్తెగా తనను ఆదరించే వారి అభిమానాన్ని సైతం పోగొట్టుకునే దిశగా షర్మిల అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

హోదాపై కాంగ్రెస్ తరఫున వివరణ ఇవ్వాలి..

కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుతో కుమ్మక్కై అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించి తీరని అన్యాయం చేసింది. రాష్ట్ర హక్కులను రక్షించకుండా, ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా ద్రోహం చేసింది కాంగ్రెస్సే. ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చి ఉంటే ఇప్పుడింత పోరాడాల్సిన అవసరమే ఉండదు కదా? తాను చేసిన తప్పులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. ఆ పార్టీ తరఫున వకాల్తా పుచ్చుకున్న షర్మిల వాటిపై సీఎం జగన్‌ను ప్రశ్నించడం విచిత్రం. కాంగ్రెస్ తరఫున ప్రత్యేక హోదా, రాజధానికి నిధులపై షర్మిల వివరణ ఇవ్వాలి. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ ఒకే మాటకు కట్టుబడ్డారు. పోరాటం ఏ పద్ధతుల్లో చేయాలో అలా కొనసాగించడంతోపాటు కేంద్రంపై ఒత్తిడి పెంచి మనపై ఆధారపడే పరిస్థితి వచ్చే వరకూ ఆ అంశాన్ని సజీవంగా ఉంచుతున్నాం. ఎప్పటికప్పుడు హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ సరైనా అవకాశం రాగానే సాధించుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. అందులో భాగంగా ప్రధాని సమక్షంలోనే విశాఖ సభలో సీఎం జగన్ హోదా అంశాన్ని గుర్తు చేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ద్రోహం..

ఏకపక్ష విభజనతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ మహానేత వైఎస్ కుటుంబానికి తీరని ద్రోహం చేసింది. 2004, 2009లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వైఎస్ చేసిన కృషే ప్రధాన కారణమని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పలు సందర్భాల్లో చెప్పారు. వైఎస్ మరణానంతరం అక్రమ కేసులు బనాయించి ఆయన పేరును నేరుగా ఎఫ్‌ఐఆర్‌లో పెట్టిన పార్టీ కాంగ్రెస్. వైఎస్సార్ తనయుడు జగన్‌ను అక్రమంగా 16 నెలలు జైల్లో నిర్బంధించిన పార్టీ కాంగ్రెస్. శంకర్రావు, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతిరాజు కలిసి ఆ కేసులు వేశారు. సోనియాగాంధీ చెబితేనే కేసులు పెట్టామని శంకర్రావు పలు మార్లు మీడియాకు చెప్పారు. సోనియా చెప్పినట్టుగా జగన్ విని ఉంటే కేసులు పెట్టేవాళ్లం కాదని అప్పట్లో కాంగ్రెస్‌లో కీలక భూమిక పోషించిన కేంద్ర మాజీ మంత్రి గులాంనబీ ఆజాద్ కూడా చెప్పారు. అంటే అవన్నీ అక్రమ కేసులేనని తెలిసిపోతోంది.

క్లుప్తంగా...

అంతా అప్పులే.. అభివృద్ధి ఎక్కడ?

ఏపీ కాంగ్రెస్ నూతన చీఫ్ షర్మిల విమర్శలు



సాక్షి, అమరావతి/పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని ఏపీ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల విమర్శించారు. ఆదివారం విజయవాడలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ల లోన్లతో కలిపి రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లకు చేరాయన్నారు. విభజన నాటికి రాష్ట్ర అప్పులు రూ.లక్ష కోట్లు ఉంటే చంద్రబాబు అమరావతి రాజధాని అంటూ 3 డీ గ్రాఫిక్స్ చూపించి రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం ప్రతి రోజూ కొట్లాడి దీక్షలు చేశారని, ఎంపీలంతా మూకుమ్మడి రాజీనామా చేస్తే హోదా ఎందుకు రాదో చూస్తానన్నారని, కానీ అధికారంలోకి వచ్చాక నిజమైన ఉద్యమం చేయలేదని విమర్శలు చేశారు. 'జగన్ వచ్చాక మూడు రాజధానులని చెప్పి ఒక్కటి కూడా కట్టలేదు. ఆంధ్ర రాష్ట్రంలో, కనీసం విజయవాడలో ఒక్క మెట్రో అయినా ఉందా? కొత్త పరిశ్రమలైనా వచ్చాయా? ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా? రోడ్లయినా నిర్మించగలిగారా? ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వటానికి కూడా డబ్బులు లేవు'అని షర్మిల విమర్శించారు. మణిపూర్‌లో 2 వేల చర్చిలను ధ్వంసం చేసినా, అరవై వేల మంది క్రైస్తవులను నిర్వాసితులను చేసినా జగన్ మాట్లాడలేదన్నారు. వైఎస్సార్ చనిపోయాక పోలవరం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కాగా, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజు బాధ్యతలు స్వీకరించగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'బ్రో'.. బాబెప్పుడూ ఇంతే!

సీట్లపై ఆఖరి నిమిషం దాకా నాన్చే ధోరణిలో చంద్రబాబు

చివర్లో అతి కొద్ది సీట్లతో పవన్‌కు చెక్ పెట్టే యోచన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అంబేడ్కర్ స్మృతి వనం.. పులకించిన జనం

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పం (అంబేడ్కర్ విగ్రహం). అంబేడ్కర్ స్మృతి వనం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కుటుంబ సమేతంగా వచ్చిన వారితో ఉదయం నుంచే రద్దీ నెలకొంది. సాయంత్రం మరింత పెరిగింది. విద్యుత్ దీపాల వెలుగుల్లో స్మృతి వనం, అంబేడ్కర్ బొమ్మలు, విజువల్ షో వంటివి చూసి పులకించిపోయారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఏపీ అభివృద్ధిపై చాలెంజ్‌కు సిద్ధమా?

- పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదంటే ఎలా?
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చాలెంజ్‌కు సిద్ధమా? తమతో వస్తే.. తాము చేసిన అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపిస్తామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదనడానికి ఆమె ఎవరు.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు తెలంగాణ బిడ్డనని తిరిగి.. అక్కడ ఎందుకు పోటీ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. షర్మిల కాదు కదా.. ఎవరు వచ్చినా తమ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టలేరని, వచ్చేది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ఆదివారం మధురవాడ ఐటీ సెజ్‌లో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి అధికారంలో నిలిపిన వైఎస్సార్ పేరు ఎఫ్‌ఐఆర్‌లో చేర్చిన విషయాన్ని మరిచిపోయావా? వైఎస్సార్ దయతో కేంద్రంలో అధికారాన్ని పొంది.. ఆయన మరణం తర్వాత వైఎస్సార్ కుమారుడిని 16 నెలలు అన్యాయంగా జైల్లో పెట్టిన సోనియాగాంధీతో ఎలా కలవాలనిపించింది'అని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్‌లో ఆమె ఎందుకు చేరారో? ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌కు నిజమైన వారసులెవరో రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరి మమ్మల్ని టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమో సమీక్షించుకోవాలని షర్మిలకు హితవుపలికారు. ఏపీ ప్రజలపై నిజంగా ప్రేమే ఉంటే అవినీతికి పాల్పడ్డ చంద్రబాబును షర్మిల ప్రశ్నించాలని, రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన చంద్రబాబును నిలదీయాలని సూచించారు. అంతేగానీ దేశంలో ఎక్కడా లేని విధంగా, రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమాభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తావా.. అని ప్రశ్నించారు.

ఊపందుకున్న కులగణన

41.63 లక్షల కుటుంబాల్లో పూర్తయిన వివరాల నమోదు

సాక్షి, అమరావతి: చరిత్రాత్మక కులగణన కార్యక్రమం ఊపందుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఆదివారం కూడా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలు నమోదు చేశారు. శుక్రవారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం మొదలు కాగా, ఆదివారం రాత్రి వరకు 41,63,957 కుటుంబాలకు సంబంధించి వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. ఆదివారం ఒక్కరోజే 20.36 లక్షల కుటుంబాల వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. మూడు రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో 11,085 గ్రామ సచివాలయాల పరిధిలో 30.95 లక్షల కుటుంబాల వివరాలు నమోదు పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 3866 వార్డు సచివాలయాల పరిధిలో 10.68 లక్షల కుటుంబాల వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వివరించారు.

ఒంటికి.. రెంటికి.. ఆరుబయటికే



మరుగుదొడ్డిలో అపరిశుభ్ర వాతావరణం

- ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మరుగుదొడ్లు లేక అవస్థలు
- మరమ్మతుకు నోచుకోక వృథాగా మారిన వైనం
- 3,550 మంది చదువుతున్న కళాశాలలో 20 కూడా లేని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థినులు
- కొత్త కోర్సులు, విద్యార్థుల పెరుగుదలతో సరిపోని తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలోనే అత్యధిక మంది విద్యార్థులు చదువుతున్న డిగ్రీ కళాశాలగా ఎంవీఎస్‌కు పేరుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. కానీ, కళాశాలలో కనీస వసతులకు నోచుకోక వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న మరుగుదొడ్లు గుర్రై నెలలు గడుస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. ఫలితంగా విద్యార్థులు ఒంటికి.. రెంటికి ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి సంవత్సరం కొత్త కోర్సులు రావడం, విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటంతో ఇబ్బందులు తీవ్రతమవుతున్నాయి. ప్రస్తుతం కళాశాలలో 3,200, పీజీలో 350 కలిపి మొత్తం 3,550 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. కానీ, వీరి సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేవు. అలాగే తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ల వంటి సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చదువులు చక్కగా సాగడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

1,900 మంది బాలికలు..

ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో మొత్తం 3,550 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో మొత్తం నాలుగు మరుగుదొడ్ల బ్లాక్‌లు ఉన్నాయి. 1,900 మంది బాలికలకు గాను ఒక్క బ్లాక్‌ను కేటాయించారు. ఇందులోనూ పూర్తిస్థాయిలో వసతులు లేవు. కొన్నిచోట్ల వాటర్ కనెక్షన్ సరిగా లేకపోవడంతో మరుగదొడ్లు పరిశుభ్రంగా ఉండటం లేదు. ఇక ఒక బ్లాక్ పురుష అధ్యాపకులు, మరో బ్లాక్ మహిళా అధ్యాపకులు, సిబ్బంది వినియోగిస్తున్నారు. అలాగే 1,650 విద్యార్థులకు గాను ఒక బ్లాక్ ఉంది. ఇక్కడ 3 మరుగుదొడ్లు, 8 మూత్రశాలలు ఉండగా.. కొన్ని నెలలుగా వినియోగంలో లేవు. దీంతో బాలురు కళాశాలలో ఏపుగా పెరిగిన చెట్ల చాటుకు వెళ్తున్నారు.

వినియోగంలోకి తేవాలి..



గత కొన్ని నెలలుగా కళాశాలలో బాలుర మరుగుదొడ్లు పూర్తిగా వినియోగంలో లేకుండా ఉన్నాయి. చాలారోజులుగా వాడకపోవడంతో అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే కళాశాల అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి.

– విక్రమ్‌యాదవ్, విద్యార్థి, ఎంవీఎస్ కళాశాల

చెట్ల చాటుకు వెళ్తున్నారు..



ఎంవీఎస్ కళాశాలలో బాలుర మరుగుదొడ్లు వినియోగంలో లేవు. పూర్తిగా దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో చేసేది లేక చెట్ల చాటుకు వెళ్లాల్సి వస్తుంది. వెంటనే అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలి. అధికారులకు గతంలోనే విన్నవించినా మార్పు లేదు.

– సాయికుమార్, ఏబీవీపీ నాయకులు, ఎంవీఎస్

సమస్య పరిష్కరిస్తాం..

కళాశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. వారి సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– పద్మావతి, ప్రిన్సిపాల్, ఎంవీఎస్ కళాశాల

నల్లమల.. కిటకిట

- కొనసాగుతున్న ఉర్సు, బ్రహ్మోత్సవాలు
- భారీగా తరలివస్తున్న భక్తులు



రంగాపూర్ దర్గా ఆవరణలో భక్తుల రద్దీ

అచ్చంపేట: మండలంలోని రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సు వైభవంగా కొనసాగుతోంది. నాలుగోరోజు ఆదివారం దర్గాకు వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాట్టేళ్లు సమర్పించి ఫాతేహాలు, కందూర్లు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీరాలని చెట్టుకు ముడుపులు కట్టడం కనిపించింది. రంగాపూర్ ఉర్సు, ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు ఒకేసారి ప్రారంభం కావడంతో నల్లమల ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

ఉమామహేశ్వర క్షేత్రం..

శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అర్చకులు గురువారం ఉత్తరాయణ పుణ్యకాల స్నానములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి గణపతి, ఉమామహేశ్వరస్వామి, కాళికాదేవి, అయ్యప్పస్వామిని దర్శించుకొని స్వామివారికి అర్చనలు, విశేష పూజలు, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.



ఉమామహేశ్వరంలో భక్తులు

రుద్రయాగంతో ముగిసిన ఉత్సవాలు



వేడుకల్లో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌లో నిర్వహించిన చిన్నయ్యస్వామి రజతోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిసినట్లు పీఠాధిపతి నందీశ్వరస్వామి తెలిపారు. చివరిరోజు 218 హోమగుండాలు ఏర్పాటుచేసి 436 మంది దంపతులతో వైభవంగా రుద్రయాగం నిర్వహించారు. శ్రీశైలం జగద్గురువు ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ధర్మజాగృతి సభలు నిర్వహించి భక్తులకు ఉపదేశం ఇచ్చారు. కార్యక్రమాల్లో కేదారీనాథ్ పీఠాధిపతి వీరసోమేశ్వర స్వామి, శ్రీశైలం పీఠాధిపతి చెన్నసిద్ధిరామస్వామి, మాణికేశ్వర మఠం బాలాజీస్వామి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ముగింపురోజు గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని హరిని నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో సర్పంచ్ రఘు, నర్సింహచారి, సుధీర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, ఖాజా, తులసీరాం, చందర్‌నాయక్, కృష్ణయ్య, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం గొప్పది : ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

సేవాగుణం చాలా గొప్పదని.. దీంతో మనిషికి మానసిక ప్రశాంతత లభించి ఆయుష్షు సైతం పెరుగుతుందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు దైవాలు, మఠాధిపతులు అందరు బోధించే తత్వం ఒక్కటేనని.. అదే సేవాగుణం అన్నారు. దైవం, ధర్మం మూలంగానే ప్రపంచం కొనసాగుతుందని ఆయన వివరించారు. అనంతరం మఠానికి రూ.1.16 లక్షలు అందించారు. ఈ సందర్భంగా మఠం పీఠాధిపతి నందీశ్వరస్వామి ఎంపీ, మండల ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ప్రతాప్, చెన్నయ్య, మైసమ్మ ఆలయ చైర్మన్ కృష్ణయ్య, కొల్లూర్ సర్పంచ్ రఘు, నర్సింహచారి, సుధీర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, ఖాజా, కృష్ణయ్య, చందర్‌నాయక్, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

అచ్చంపేటలో క్రీడా సంబురం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అట్టహాసంగా ఆలిండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ ప్రారంభం

అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం సీవీకే ఆలిండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ టాస్‌వేసి టోర్నీని ప్రారంభించారు. కొంతసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఉదయం సెషన్‌లో గ్రూప్–ఏ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వర్సెస్ డెక్కన్ క్రికెట్ అకాడమీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న డెక్కన్ క్రికెట్ అకాడమీ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లను కోల్పోయి 186 పరుగులు చేసింది. అబ్దుల్ గఫూర్ 54 బంతుల్లో 75 పరుగులు చేశారు. ఎంఎస్ గౌడ్ 43 బంతుల్లో 50, మీరాజ్ హాజెఫ్‌బేగ్ 25 బంతుల్లో 40 పరుగులతో రాణించారు. 187 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్టీఆర్ స్టేడియం జట్టు.. 17.3 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటయ్యింది. దీంతో 69 పరుగుల తేడాతో డెక్కన్ క్రికెట్ అకాడమీ జట్టు గెలిచింది. డెక్కన్ బౌలర్లు మిర్జా ముజాకీర్ 4-1-27-3, మిర్జా అజీంబేగ్ 3.3-0-13-2, మహ్మద్ అద్నాన్ 3-1-15-2 వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా అబ్దుల్ గఫూర్ నిలిచాడు. అనంతరం మధ్యాహ్నం సెషన్‌లో గ్రూప్–బీ నుంచి ఆంధ్రా సూపర్ లయన్స్ వర్సెస్ గట్టు తిమ్మారెడ్డి సీసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్రా సూపర్ లయన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. జట్టులో రాజు 34, మహియాదవ్ 23, హన్మంత్, మహేందర్‌రెడ్డి, ఉమాకర్ 16 చొప్పున పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్ నిఖిల్‌గౌడ్ 4-0-12-4 వికెట్లతో రాణించాడు. 156 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గట్టు తిమ్మారెడ్డి జట్టు.. 18.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి విజయాన్ని అందుకుంది. 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. జట్టులో హన్మంత్ 40, అంజి 32, అజ్మత్ 16 పరుగులతో రాణించారు. ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌ను నిఖిల్‌గౌడ్ అందుకున్నారు.

నేటి మ్యాచ్‌లు..

సోమవారం ఉదయం సెషన్‌లో గ్రూప్–ఏ నుంచి ఎంఏకే క్రికెట్ క్లబ్ బళ్లారి వర్సెస్ ఫలక్‌నుమా సీసీ, గ్రూప్–బీ నుంచి డీఎస్ ఎలెవన్ వర్సెస్ మస్కటి ఎలెవన్ జట్లు తలపడనున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు చంద్రమోహన్, రఘురాం పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి హంసవాహన సేవ



శ్రీవారి సముద్రం వద్ద స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ మండలం సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం హంసవాహన సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం హంస వాహనంపై ఊరేగించారు. శ్రీవారి సముద్రం వద్ద ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ మూర్తులను ఆలయానికి చేర్చారు. హంసవాహన సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారి సన్నిధిలో నెలరోజుల పాటు జాతర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్‌రావు, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.